మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## అప్పుడే మొదలైన ఎన్నికల తాయిలాల పంపకాలు

**మిరుదొడ్డి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** దుబ్బాక నియోజకవర్గంలో అప్పుడే ఎన్నికల వాతావరణం నెలకొంది. గత అరు నెలలుగా అధికార విపక్ష పార్టీలకు చెందిన అభ్యర్థులు బాధిత కుటుంబాలను పరామర్శల పేరిట అర్థిక సహాయం అందజేస్తూ, వివిధ శుభకార్యక్రమాలలో పాల్గొంటూ ప్రజలకు చేరువయ్యేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అయా పార్టీ నాయకులు నాన పాట్లు పడుతున్నారు. ఒక పార్టీ మండల పార్టీ అధ్యక్షులు వాహన ఖర్చులు ద్వితీయ శ్రేణి నాయకులకు పోలింగ్ బూత్ ఇంచార్జిలకు నెల వారి ఖర్చులు ఇస్తుంటే ఇంకొక పార్టీ కొద్ది రోజుల్లో ఎన్నికలకోడ్ వస్తుందని ఊహించి ముందస్తుగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నియోజకవర్గంలోని అయా మండలాలల్లో గ్రామాల్లో గ్రామాలు, వార్డుల వారీగా ఇంటింటికి పట్టుచీర పార్టీ సింబల్ ఉన్న గొడుగులను పంపిణీ చేస్తున్నారు. మొత్తం మీద నియోజకవర్గంలో సుమారు 50 వేల కుటుంబాలకు పట్టు చీరలు, గొడుగులు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల కోడ్ రాకముందే నాయకులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నానాపాట్లు పడుతున్నారని చెప్పక తప్పదు.

## దుర్గమ్మ సన్నిధిలో భక్తుల సందడి

**పాపన్నపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:** పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయ ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకోవడంంతో ఆలయ పరిసరాలను అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాల సమర్పించి ఒడి బియ్యం, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలాగౌడ్, ఇఓ మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవివీర్‌కుమార్, తోట నరసింహులు, వరుణాచారి, రాజు శ్రీకాంత్, సంతోష్‌లు తగు ఏర్పాట్లుచేశారు. భక్తులు ఆలయ అర్చకులు శంకరశర్మ, పార్థివ శర్మ, మురళీధర్‌లు వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాలలో ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తన సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు.



అసుపత్రి నిర్మాణపనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

### వెయ్యి పడకల ఆసుపత్రి త్వరలో ప్రారంభానికి
## సిద్ధం చేయాలి : కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో 28 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న వెయ్యి పడకల ప్రభుత్వ అసుపత్రి నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకోవడంతో ప్రారంభించడానికి తగు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ సంబంధిత అధికారులకు సూచించారు. అదివారం వెయ్యి పడకల అసుపత్రి పనులను అయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చిన్నచిన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అసుపత్రిలో అవసరమయ్యే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలన్నారు. రాష్ట్ర అర్థిక, అరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ధృడ సంకల్పంతో చేపట్టిన ప్రాజెక్టు వెయ్యి పడకల అసుపత్రిని త్వరలో పెద్ద యెత్తున్న ప్రారంభించడానికి సిద్దం చేయాలని అధికారులను అదేశించారు. అయన వెంట మెడికల్ కళాశాల డైరెక్టర్ విమలాథామస్, డిఎంఈవో రమేష్‌రెడ్డి, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మిలాద్-ఉన్-నబి శాంతి ర్యాలీ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇస్లాం ధర్మం శాంతికి నిదర్శనమని..శాంతి, సమసమాజ స్థాపనే ఇస్లాం ముఖ్య ఉద్దేశం అని ఉలేమాలు,తంజీమ్ ఉల్ మసాజిద్ ఇంచార్జి అధ్యక్షులు నయ్యర్ పటేల్ అన్నారు. మొహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని పస్బానే మిల్లత్ మిలాద్ సొసైటీ అధ్వర్యంలో అదివారం జిల్లాకేంద్రంలో భారీ శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం అయన మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త ప్రవచనాలు జీవన విధానానికి సూచికలు అన్నారు. ముస్లిం మత పెద్దలు మౌలానా ఖురేషి, మొహమ్మద్‌రఫి, మొహమ్మద్ గౌస్,కరీం పటేల్‌లు మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త కారణ జన్ముడని అయన చూపిన బాటలో నడిస్తే జీవితం అంత సుఖ శాంతులతో నడుస్తుందన్నారు. అయన మానవాళికి అదర్శప్రాయుడని తెలిపారు. తండ్రి అస్తిలో సమాన భాగాన్ని అయన స్త్రీలకు అందజేశారని తెలిపారు. అయన జీవితాన్ని అదర్శంగా తీసుకొని గంగ జమున తహజీబ్‌తో కలిసి ఉండాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ కేతినేని సురేందర్‌రెడ్డి అధ్వర్యంలో సీఐలూ కృష్ణరెడ్డి, రవికుమార్, భానుప్రకాష్‌లు పోలీసు బందోబస్తు నిర్వహించారు. ర్యాలీ అనంతరం అన్నదానకార్యక్రమం నిర్వహించారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బస్వాపూర్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బస్వాపూర్ మోడల స్కూల్ విద్యార్థులు

**పుల్కల్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బస్వాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పి.జ్యోతి, పిడి రాజులు తెలిపారు అండర్ 19 విభాగంలో ఇంటర్‌మీడియట్ విద్యార్థులు మనోజ్ఞ, సౌజన్ బాబు, అండర్ 14 విభాగంలో బస్వంత్, నందు, సందీప్‌లు ఎంపికయినట్లు పేర్కొన్నారు. 9వ తెలంగాణ స్టేట్ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ 2023కు విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను వారు ప్రత్యేకంగా అభినందించారు.

### జానకంపేటలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

**అమీన్‌పూర్, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి జానకంపేట గ్రామ అభివృద్ధి తార్కానమని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం జానకంపేటలో 5 కోట్లతో చేపట్టిన నూతన గ్రామ పంచాయతీ భవనం, సీసీరోడ్లు, కుల సంఘాల భవనాలు, క్రీడా ప్రాంగణం, మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్, పల్లెప్రకృతి వనం తదితర అభివృద్ధి పనులను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి పాండుయాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జీఎంఆర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ జానకంపేటలాంటి చిన్న గ్రామ పంచాయతీని సైతం ఐదు కోట్లతో అభివృద్ధి చేశామంటే కేవలం సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే సాధ్యమైందన్నారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు త్వరలో ముదిరాజ్, ఎస్సీ కులస్తుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించడంతో పాటు ఎన్నికల అనంతరం గ్రామస్తుల అవసరాల కోసం ఆధునిక వసతులతో ఫంక్షన్ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేవానంద, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు కృష్ణ, భాస్కర్‌గౌడ్, శ్రీకాంత్, మల్లేష్, గ్రామ పంచాయితీ పాలకవర్గం, గ్రామ పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## కులవృత్తుల ప్రజల సంక్షేమం కోసమే బిసిబంధు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** పేద కులవృత్తుల ప్రజల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం బీసీ బంధు పథకం ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మెదక్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 300 మంది లబ్ధిదారులకు మూడవ విడత బీసీబంధుచెక్కులను ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద కులవృత్తుల ప్రజలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందజేసి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం బీసీబంధు పథకం ద్వారా అధునాతన పరికరాల కొనుగోలుకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. ఈ ఆర్థిక సహాయం సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్రంలోని కొన్ని నియోజకవర్గాఆల్లో బీసీబంధు పథకం ఒకటో విడత మాత్రమే పంపిణీ మాత్రమే జరగగా, మెదక్ నియోజకవర్గంలో మూడోవిడత పంపిణీ జరగడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ పథకంపై ప్రజలకు విస్తృత ప్రచారం అయ్యేలా అవగాహన కల్పించాల్సి న అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టారన్నారు. రైతుబంధు, రైతుభీమా, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, దళితబంధులాంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా అడ్డుపడ్డా తెలంగాణను వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు తీసుకెళ్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీసీ బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకొని కులవృత్తుల వారు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మెదక్ నియోజకవర్గంలో మూడవ విడత బీసీ బంధు పంపిణీ జరగడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మంత్రి హరీష్‌రావుకు వినతి పత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య

### రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి

**చేర్యాల, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కాటం లింగయ్య ఆదివారం మంత్రి హరీష్ రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ కావాలని ప్రాంత ప్రజల చిరకాల కోరకని ఆయన తెలిపారు. ఈవిషయంపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

### తిరుపతిరెడ్డి రాజీనామను స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల గోపాల్‌రెడ్డి

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి రాజీనామాను స్వాగతిస్తున్నామని ఆపార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నశంకరంపేటలో పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. తిరుపతిరెడ్డి పార్టీలో ఉన్నప్పటికి బీఆర్ఎస్‌కే మద్దతు పలికేవారని ఆరోపించారు. అధిష్టానం నియోజక వర్గం నుండి ఎవరికి టాకెట్ ఇచ్చినా భారీ మెజారిటీతో గెలుపొందించుకుంటామన్నారు.కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, బందెల సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, ఆంజనేయులు, యాదగిరి, శివకుమార్, నర్సింలు, శంకర్, ప్రకాశ్, శ్రీశైలం, స్వామి, నెల్లూరు పాల్గొన్నారు.

### తిరుపతిరెడ్డి రాజీనామ బాధాకరం

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి రాజీనామా బాధాకరమని వైస్ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శివకుమారు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ పార్టీ కష్టాకాలంలో తిరుపతిరెడ్డి తనసేవలను అందించి నప్పటికి అదిష్టానం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీ టీసీలు ప్రసాద్, మున్నానాయక్, సంతోశ్, మల్లేషం, రమేష్, నర్సాగౌడ్, నవీన్ పాల్గొన్నారు.

### మైనంపల్లి వెంటే ఉంటాం

**ముదిరాజ్ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు అరుణ**

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మైనంపల్లి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రోహిత్ ఏ పార్టీలో కోనసాగిన వెంటే ఉంటామని ముదిరాజ్ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు అరుణ తెలిపారు. ఆదివారం చిన్నశంకరంపేటలో ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నుండి మెదక్ అభ్యర్థిగా రోహిత్‌కు టికెట్ ఇస్తే భారిమెజారిటీతో గెలుపించుకుంటామన్నారు. నేడు కార్యకర్తలతో కలిసి చిన్నశంకరంపేట నుండి హైదరాబాద్ వరకు బారీ ఎత్తున వాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కోన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

### వృద్ధులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**నర్సాపూర్, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ వయో వృద్ధులను గౌరవించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సాపూర్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, విజన్ స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శాలూవాలతో, పూలమాలలతో వృద్ధులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృద్ధులకు చేయూతనందించే బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందన్నారు. ఈ విషయంలో వృద్ధకు ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసకుంటామన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి నిర్వహించడం అభినందనీయమన్నారు. వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వీరిని పోలింగ్ కేంద్రాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాల్లో తీసుకెళ్లి ఓటు వేసిన అనంతరం ఇళ్లవద్దకు చేర్చాలన్నారు. అనంతరం కలెక్టర్ 5న నర్సాపూర్‌లో ప్రారంభించనున్న సఖి సెంటర్‌ను సందర్శించారు. సిడిపిఓ హేమాభార్గవి మాట్లాడుతూ అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని ప్రతిఏటా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విజన్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో వారిని సన్మానించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహాసీల్దార్ కమలాద్రి, విజన్ ఎన్‌జివో బాధ్యులు అభర్ణ, వృద్ధులు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మట్టి మాఫియాను అడ్డుకున్న గ్రామస్థులు

**బెజ్జంకి, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వీరాపూర్-తోటపల్లి గ్రామాల మధ్య గల కెనాల్ కాలువ అనకట్ట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారని అదివారం వీరాపూర్ గ్రామస్తులు టిప్పర్లను అడ్డుకున్నారు. గత కొద్ది రోజులుగా కొంత మంది మట్టి మాఫియాదారులు రాత్రి పగలు తేడా లేకుండా టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో ఇండ్ల నిర్మాణాల అవసరాలతో సంబంధం లేకుండా వ్యాపార సంస్థలకు, వెంచర్ నిర్మాణాలకు మట్టిని తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. మట్టిని తరలించే సమయంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న బాటసారులు, వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమంగా మట్టి తరలించే మాఫియాపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

## కాంగ్రెస్‌కు కంఠారెడ్డి గుడ్‌బై..

- విలువలకు ప్రాధాన్యత లేనిచోట నిలువలేను
- పార్టీని పదేళ్లుగా ముందుకు తీసుకెళ్లాను
- డబ్బు సంచులకే పట్టం కడుతున్నారు
- కంఠారెడ్డి తిరుపతిరెడ్డి



మాట్లాడుతున్న కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

**మెదక్ రూరల్, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** విలువలకు ప్రాధాన్యత లేనిచోట తాను నిలువలేక రాజీనామా చేయాల్సి వచ్చిందని కంఠారెడ్డి తిరుపతి రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆదివారం పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామాచేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కంఠారెడ్డి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాల కాలంలో జిల్లాలో తుడిచిపెట్టుకుపోయిన కాంగ్రెస్ పార్టీకి జీవం పోసి పార్టీ ప్రతిష్ట కోసం కష్టపడి పనిచేసినా సరైన స్థానం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమధ్య పార్టీలో జరుగుతున్న పరిణామాలను చూస్తే ఏళ్లకేళ్లుగా కష్టపడ్డ కార్యకర్తలకు, క్రమశిక్షణగల నేతలకు తగిన ప్రాధాన్యతలేదని, నిన్నగాకమొన్న డబ్బు సంచులతో వచ్చిన వారికి పార్టీలో చోటు ఇస్తూ నియోజకవర్గాల వారిగా పార్టీ టికెట్‌లను అమ్ముకోవడం, నిజమైన కార్యకర్తలకు అన్యాయం ఇలాంటి పరిణామాలకు కాంగ్రెస్ అధిష్టానం సోనియా, రాహుల్ గాంధీలు మౌనం వహించడం పార్టీని నష్టపరుస్తాయన్నారు. గత పది సంవత్సరాలుగా జిల్లా మొత్తం పర్యటిస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను తూచా తప్పకుండా అమలు చేస్తూ అధికార పక్షం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు అండగా ఉంటూ ఇన్నాళ్లు పార్టీని జిల్లా వ్యాప్తంగా పటిష్టపరిచానన్నారు. కేవలం అధికార దాహం కోసమే పార్టీ టికెట్‌లు కొనుకొన్ని మూడు నెలల ముందే వచ్చినా ఏ మాత్రం రాజకీయం అనుభవం లేని వ్యక్తులకు పార్టీ టికెట్‌లను కేటాయించడంపై తాను తీవ్ర అసహనాన్ని గురయ్యానన్నారు. పార్టీ కోసం చేసిన సేవలు, పార్టీ బలోపేతం కోసం పడ్డ కష్టాలను అధిష్టానం గుర్తించలేదన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి ఎన్నో అక్రమ పోలీసు కేసులను ఎదుర్కున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారికే నాయకత్వాన్ని అప్పగించడాన్ని చూస్తే ప్రజలు విస్తుపోతున్నారన్నారు. పార్టీలో అధికారంలో లేకున్నప్పటికీ తాను నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ పూర్తి అంకితభావంతో పార్టీకే సేవ చేశానన్నారు. కర్ణాటక రాష్ట్రం ఎన్నికల తరువాత తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుందని కార్యకర్తలతో పాటు తాను ఆశాభావం వ్యక్తం చేసినట్లు తెలిపారు. కానీ ప్రస్తుత పరిణామాలు డబ్బుల కోసం పార్టీ టికెట్‌లు అమ్ముకోవడం చూస్తే ఆ వ్యక్తులు ఎంతటివారైనా ప్రజలకు వారిపై నమ్మకం కలిగించలేరన్నారు. ప్రతి గ్రామంలో కార్యకర్తల ద్వారా గ్రామ ప్రజలతో నిత్యం వారు ఎదుర్కొంటున్న సమస్యలపై అనుదినం పోరాటం చేశామన్నారు. కానీ ఇప్పటి పరిస్థితుల్లో కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు కాకుండా డబ్బులుంటే ఎవరైనా కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను సాధించుకోవచ్చనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ప్రస్ఫుటంగా తెలియజేసిందన్నారు. ఒక నిజమైన కార్యకర్తగా ఇలాంటి పరిణామాలు జీర్ణించుకోలేక పార్టీకి రాజీనామా చేశానన్నారు. త్వరలోనే కార్యకర్తలను, అభిమానులను సంప్రదించి నిర్ణయం తీసుకుంటామన్నారు.



ఆశా కార్యకర్తలలకు చాడ సంఘీభావం దృశ్యం

### ఆశా కార్యకర్తల ఉద్యమానికి 'చాడ'సంఘీభావం

**హుస్నాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త :** నిత్యం ప్రజలకు వైద్య సేవలందిస్తూ రాష్ట్రప్రభుత్వానికి కేంద్రం నుండి అవార్డులు వచ్చేలా చేశారని కానీ వీరినిప్రభుత్వం ఏమాత్రం పట్టించకోకుండా గాలికదిలేస్తూ వారిని మానసిక వేదనలకు గురి చేస్తోందని వారికి అవసరాల కనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్న వారి పోరకు సిపిఐ జాతీయకార్యవర్గసభ్యులు చాడ వెంకటరెడ్డి వారికి తన సంఘీభావాన్ని ప్రకటించారు.ఆదివారం నాడు వారి ఉద్యమానికి అనుగుణంగా వారు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపేందుకు వచ్చి తన మద్దతును ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్,రాష్ట్ర నాయకులు గడిపె మల్లేష్,జిల్లా కార్యవర్గసభ్యులు ఎడల వనేష్,మండల కార్యదర్శి కొమ్ముల బాస్కర్,దళితససంఘాల నాయకులు మారుపాఅక అనిల్ తతదితరులు పాలల్గొన్నారు.

### తిరుపతిరెడ్డి రాజీనామా బాధాకరం

**-టిపిసిసి అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ**

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం వ్యక్తిగతంగా తనకు బాధను కలిగించిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కాంగ్రెస్ అధిష్టానం కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తలను గుర్తించి, దేశానికి మార్గదర్శిగా నిలిచిన ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను పాటిస్తుందని తాను బలంగా విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా ఎవరికీ టికెట్ ఖరారు చేయలేదని, ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం ఒక కుటుంబంలో ఇద్దరికి టికెట్లు ఉండవని ఆయన ప్రకటించారు. సర్వేల ఆధారంగా టికెట్ ఇస్తారని, ఆ ప్రకారం నియోజకర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తాను మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థిని కాగలనని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**కొందరి అత్యుత్సాహం పార్టీకి ప్రమాదకరం...**

కాంగ్రెస్ పార్టీలోని పాత కార్యకర్తలు విస్మయానికి గురిచేసేలా ఎవరిని సంప్రదించకుండా సొంత ప్రయోజనాల కోసం ర్యాలీలు చేయడం పార్టీ క్రమశిక్షణ రాహిత్యాన్ని ఉల్లంఘించడమేనని ఆయన వెల్లడించారు. పార్టీ నియామావళి ప్రకారం ర్యాలీలు నిర్వహించాలని, నియోజకవర్గంలోని పీసీసీ ప్రతినిధులను సంప్రదించకుండా దండయాత్రలా మెదక్‌కు వచ్చేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలను ఆయన తప్పుపట్టారు. ఈ పరిణామాలతో కాంగ్రెస్‌లో గత పదేళ్లుగా పనిచేస్తూ అధికార పార్టీ అణిచివేతకు గురైన కార్యకర్తలు తీవ్రంగా అన్యాయానికి గురవుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందరినీ సంప్రదించి, ఒప్పించి మాత్రమే కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు.

### దేశంలోనే ఆదర్శం 'తెలంగాణ' : ఎంపి ప్రభాకర్‌రెడ్డి



గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపి ప్రభాకర్‌రెడ్డి

**మిరుదొడ్డి, అక్టోబర్ 1, ప్రభాతవార్త:** దేశంలోనే తెలంగాణ రాష్ట్ర అదర్శంగా నిలుస్తుందని మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతేలో నూతన గ్రామ పంచాయతీ భవనంతోపాటు ఎస్సీ కాంపౌండ్‌వాల్, భూంపల్లిలో నిర్మించిన ప్రాథమిక పాఠశాలలో అదనపు గదులు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, నాయి బ్రాహ్మణ భవనం, పద్మశాలి భవనాన్ని సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ, ఎంపిపి గజ్జల సాయిలు, జడ్పీటిసి లక్ష్మి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సర్పంచ్‌లు శ్రీనివాస్, భాగ్యలక్ష్మీతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని..చెప్పిందే చేస్తుందని సిఎం కెసిఆర్ అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్ నాయకులు మాయ మాటలు నమ్మిమోసపొవద్దన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పోలీసు రాజులు, భాస్కరాచారి, ఉమారాణి, జీడిపల్లి రవి, సూకురి లింగం, పన్యాల వెంకటరెడ్డి, గొట్టం రాధాకృష్ణ, వెంకటరెడ్డి, బాల్‌రెడ్డి, జన్నారెడ్డి, జంగం నాగరాజు, శ్రీనివాస్, దుబ్బారాజం, నరేష్, అధికారలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం భూంపల్లిలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను ప్రారంభించి లబ్ధిదారులకు మెదక్ ఎంపి చేతుల మీదుగా పట్టాలు అందించారు.

### పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

**చేర్యాల, అక్టోబర్ 1, ప్రభాతవార్త :** మండలంలోని గుర్జుకుంట, వేచరేణి గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీల భవనాల నిర్మాణాలకు జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గుర్జకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాల అసమర్థ పాలనలో రాష్ట్రం కనీస సౌకర్యాలకు నోచుకోని పరిస్థితి నెలకొందని, రైతుల బోరు మోటార్లకు మీటర్లు పెట్టి కనీసం 7గంటల కరెంట్ ఇవ్వకుండా రైతుల ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉండేవని గుర్తు చేశారు. నేడు సీఎం కేసిఆర్ పాలనలో రైతులు సుభిక్షంగా ఉంటూ సుఖసంతోషాలతో జీవిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

**పల్లా పార్టీకి అన్యాయం చేస్తుండూ...**

పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధిష్టానాన్ని ధిక్కరించి జనగామాలో పార్టీ మీటింగ్‌లు పెట్టి వర్గాలుగా ఏర్పాటు చేశాడని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీలో ఒకటే వర్గం అది కేసిఆర్ వర్గమని తెలిపారు. పల్లా పార్టీకి ద్రోహం చేస్తున్నాడని మీటింగులతో కార్యకర్తలు ఆగమైవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఉల్లపల్లి కర్ణాకర్, గుర్జకుంట సర్పంచ్ పుర్మ మమత రాంరెడ్డి, చేర్యాల మున్సిపల్ వైస్‌చైర్మన్ నిమ్మరాజీవ్‌రెడ్డి, వేచరేణి సర్పంచ్ ఏనుగుల దుర్గయ్య, ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశం, వైస్ చైర్మన్ పూర్మ వెంకట్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం తదితులు పాల్గొన్నారు.



పంచాయతి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


మొక్కలు నాటుతున్న టెలి కమ్యూనికేషన్ తెలంగాణ సర్కిల్ అధికారి ఎం.అనిత

బేగంబజార్, అక్టోబర్ 1(ప్రభాతవార్త: చుట్టు ప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టెలి కమ్యూనికేషన్ తెలంగాణ సర్కిల్ కంట్రోలర్ ఎం.అనిత కోరారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రిత్వశాఖ ఆదేశాను సారంగా స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాంపల్లిలోని కట్టెల మండి లోని ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాలలో గార్బేజీ ఫ్రీ ఇండియా అనే నినాదంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మొక్కలను నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంస్థలో మూత్రశాలలను శుభ్రంగా ఉంచుకోవాలని,చెత్తాచెదారం లేకుండా శుభ్ర పర్చుకోవాలని,అప్పుడే ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలుగుతామన్నారు. గ్లోబల్ వార్మింగ్‌ను నివారించడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని,అప్పుడే పరిశుభ్రమైన దేశంగా అవతరిస్తుందన్నారు.టెలి కమ్యూనికేషన్ తెలంగాణ సర్కిల్ సహాయ కంట్రోలర్ సి.ఎం.సంపర్ మాట్లాడుతూ మన పరిసరాలని కాకుండా చుట్టు పక్కల పరిసరాలను శు భ్రంగా ఉంచుకున్నప్పుడు రాబోయే తరం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు.ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛత ఈసేవ కార్యక్రమాన్ని మా పాఠశాలలో నిర్వహిచడం చాలా ఆనందంగా ఉందన్నారు. పాఠశాలను పరిశుభ్రం చేయించారు.స్కూల్ అవరణలో కూడా పెయింటింగ్ వేశారు.ఈకో ఫ్రెండ్లీ చెత్తబుట్టాలను ఇచ్చారు.సిజిఎం ఆఫీసు నుంచి ఆంధ్ర విద్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.ఈకార్యక్రమంలో టెలి కమ్యూనికేషన్ అకౌంట్స్ ఆఫీసర్ టి.భాను,పాఠశాల ఉపాధ్యాయులు పి.హేమ తదితరులు పాల్గొన్నారు.

## 3 నుంచి తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ తదితరులు

**సాయికిరణ్ యాదవ్**

కంటోన్మెంట్, అక్టోబర్ 1 ప్రభాతవార్త: ఈ నెల 3 నుంచి మోండా డివిజన్‌లోని ఆదయ్య నగర్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ్స ను నిర్వహించనున్నట్లు సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ తెలిపారు. ఆదివారం ఆదయ్య నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సాయి యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు పురస్క రించుకొని ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మూడు రోజుల పాటు సాయంత్రం రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. బాలుర వాలీబాల్ పోటీల్లో దక్షిణ మధ్య రైల్వే అర్మీ రెడ్, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్ ్స అథారిటీ ఆర్మీగ్రీన్,లాల్ బహదూర్ స్టేడియం జట్లు పాల్గొంటాయన్నారు. అదే విధంగా బాలికల వాలీబాల్ జట్టు నుంచి జిహెచ్ఎంసి ఆదయ్య నగర్ ప్లేగ్రౌండ్, తూంకుంటలోని తెలంగాణ స్పోర్ట్ ్స స్కూల్, జింఖానా ప్లే గ్రౌండ్, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ జట్లు పాల్గొంటాయన్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీ,ప్రశంసపత్రాలు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆకుల హరిక్రిష్ణ, నాగులు, రాములు, జయరాజ్‌లు పాల్గొన్నారు.

## పేద మధ్య తరగతి ప్రజల కోసం మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్స్ నిర్మాణం

**మంత్రి తలసాని**


పాన్ బజార్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాలు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

బేగంపేట అక్టోబరు 1,ప్రభాతవార్త : పేద మధ్య తరగతి ప్రజల మేలు కోసమే ప్రభుత్వం మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్స్ నిర్మాణం చేపడుతుందని,మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఆదివారం రాంగోపాల్‌పేట డివిజన్ పాన్‌బజార్‌లో రూ4.90కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న మల్టీ పర్ప స్ ఫంక్షన్ హాలు నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫంక్షన్ హాలు నిర్వహణ కోసం పేద,మధ్య తరగతి ప్రజలు లక్షలాది రూపాయల అద్దెలను చెల్లించలుక ఆర్ధికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నారని,చెప్పారు.వారికి ఆ ఇబ్బందులను దూరం చేయాలనే ఆలోచనతోనే అన్ని సౌకర్యాలతో కూడిన ఫంక్షన్ హాల్స్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు.ఇప్పటికే నియోజకవర్గం పరిధిలోని బేగంపేట, బన్సీలాల్‌పేట లలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్స్‌ను నిర్మించామన్నారు.పాన్ బజార్ ప్రాంత ప్రజలకు కూడా వీలైనంత త్వరలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాలును అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జోనల్ కమీషనర్ రవికిరణ్,ఈఈ సుదర్శన్,వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు,కార్పొరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్,మాజీ కార్పోరేటర్ అత్తెల్లి అరుణా శ్రీనివాస్‌గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 6న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆత్మీయ సమ్మేళనం

**గోషామహల్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించాలని విజ్ఞప్తి చేసిన గడ్డం శ్రీనివాస్‌యాదవ్**



హైదరాబాద్, అక్టోబరు 1 ప్రభాతవార్త : గోషామహల్ టికెట్ తనకు కేటాయిస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సిఎం కెసిఆర్ పూర్తి సర్వే నిర్వహించి తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించాలని కోరారు. ఆదివారం కాచిగూడలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ శిరీష ఓంప్రకాష్‌యాదవ్ దంపతులతో కలిసి మాట్లాడారు. ఈ నెల 6న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 10వేల మందితో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి గోషామహల్ నియోజకవర్గంలో తన సత్తా చూపిస్తానని చెప్పారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమ్మేళనంలో హైందవి విద్యాసంస్థలో చదివిన విద్యార్థులతోపాటు, నియోజకవర్గానికి చెందిన ప్రజలు పాల్గొంటారని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి, స్థానిక ప్రజల కోసం తాను అందించిన సేవలను గుర్తించి తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించాలని ఈ సందర్భంగా సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్‌లకు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు.

## శ్రీభారతి సంగీత సాహిత్యాలసేవ అభినందనీయం


డాక్టర్ ఎం.లక్ష్మినారాయణాచార్యులుకు శ్రీభారతి ఆత్మీయ పురస్కారాన్ని అందించిన దృశ్యం

చిక్కడపల్లి, అక్టోబరు 1 ప్రభాతవార్త: శ్రీభారతి మ్యూజిక్ అకాడమి నిర్వహణలో జరుగుతున్న సంగీత, సాహిత్య సేవలు అభినందనీయం అని ప్రముఖులు ప్రశంసలు కురిపించారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానస భలోని కళాదీక్షితులు కళావేదికలో శ్రీభారతి మ్యూజికన అకాడమి నిర్వహణలో విఖ్యాతన టుడు, పద్మ భూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతిని పురస్క రించుకుని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు పురస్కారాల ప్రదానోత్స వ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత, ప్రముఖ గాయకుడు చింతలపాటి సురేశ్ ఆధ్వ ర్యంలో జరిగింది. తిరుమల గ్రూప్స్ అధినేత నంగునూరి చంద్రశేఖర్ పాల్గొని శ్రీభారతి అక్కినేని పురస్కా రాలను అందించి గౌరవించారు. బిహెచ్‌పి విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఆఫ్ డివైనిటి అవార్డుగ్రహీ, ప్రముఖ ఆధాయత్మిక యోగా గురువు డాక్టర్ ఎం.లక్ష్మినారాయణాచార్యులుకు శ్రీభారతి ఆత్మీయ పురస్కారాలను ప్రసంగించి గౌరవించారు. శ్రీభారతి–అక్కినేని జీవన సాఫల్య పురస్కారం, విశ్వకళాచైతన్యభారతి బిరుదును ఎన్టీఆర్ తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారగ్రహీత, ప్రముఖ దర్శక నిర్మాత నిట్ట గోపాల కృష్ణ (లక్ష్మణరేఖ ఫేమ్)కు, శ్రీభారతి–అక్కినేని 'నట చైతన్యభారతి' బిరుదును ప్రముఖ సినీ నటులు పృథ్వీరాజ్‌కు అందించగా, శ్రీభారతి ఆత్మీయ పురస్కారాన్ని ప్రముఖ జ్యోతిష్య విద్వాన్, 'విశ్వ కళాచైతన్య భారతి' డాక్టర్ బ్రహ్మశ్రీ పెద్దింటి రామంకు అందించి గౌరవించారు. భాగ్యనగర్ బ్యాంకర్స్ గ్రూప్ వ్యవస్థాపకుడు టిఎస్వీ.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అమెరికాలోని వాలీ వేదిక ప్రతినిధి కె.శారద, మిమిక్రి కళాకారుడు ఆర్‌సీఎం.రాజు శ్రీనివాస్, బి.సాయిబాబు, నాదస్వర నిపుణులు షేక్ హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు. సంస్థ నిర్వాహకులు చింతలపాటి సురేశ్ స్వా గతం పలుకుతూ అక్కినేనితో తమసంస్థకున్న అనుబంధాన్ని వివరించారు. డాక్టర్ సత్య అభినందనలు తెలపగా తొలుత చింతలపాటి సురేశ్, భువన కృతి,శర్వాని, నేహ, అనూరాధ, వైష్ణవి పాడిన ఎన్నో పాటలు శ్రోతలను రంజింపచేశాయి.


రేషన్ డీలర్లకు ప్రభుత్వం కమిషన్ పెంచినందుకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను రాష్ట్ర రేషన్ డీలర్ల జేఏసీ ప్రతినిధులు నాయికోటి రాజు,పుస్తె శ్రీకాంత్‌లు ధన్యవాదాలు తెలియజేస్తున్న దృశ్యం


5వ వార్డు గాంధీ నగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత తదితరులు

## సమస్యల పరిష్కారానికి కృషి : లాస్య

కంటోన్మెంట్, అక్టోబర్ 1 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత తెలిపారు. అదివారం 5వ వార్డులోని మహాత్మ గాంధీ నగర్‌లో పాదయాత్ర జరిపి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించేందుకు కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పెద్దాల నర్సింహ్మా, పెంట శ్రీహరి, గంట రాజు తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారి సభ్యులు ప్రజలకు చేస్తున్న సేవలు ప్రశంసనీయం

**వడ్డేపల్లి రాజేశ్వరరావు**


అల్పాహార కార్యక్రమంలో పాల్గొన్న రాజేశ్వరరావు

కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 1, ప్రభాతవార్త : సమాజ శ్రేయస్సు కోసం బ్రహ్మకుమారీస్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కొనియాడారు. ఆదివారం ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో బ్రహ్మ కుమారీస్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని అల్పాహారాన్ని స్వీకరించారు. అనంతరం వారు చేస్తున్న సేవలకు గుర్తింపుగా బ్రహ్మ కుమారీస్ సభ్యులకు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారీస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో స్వచ్ఛతహి సేవా



స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబరు 1 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బృంధావన్ కాలనీలో ఆదివారం స్వచ్ఛతహి సేవా కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిహెచ్ఎంసి కౌన్సిల్ విప్,కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో పాల్గొని తమ విధిగా తమ ఇండ్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఉడుత లక్ష్మి,రావుల భాస్కర్,పాండు యాదవ్,కె.బాబు,శివరాజు,నాగమణి,నర్సింహరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కృష్ణాయాదవ్‌ను కలిసిన బిజెపి నాయకులు


మాజీ మంత్రి కృష్ణాయాదవ్‌ను సీనియర్ బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ సన్మానిస్తున్న దృశ్యం

యాకుత్‌పుర,అక్టోబరు 1 ప్రభాతవార్త : బిజెపిలో చేరిన పాతబస్తీకి చెందిన మాజీమంత్రి సి.కృష్ణా యాదవ్‌ను చార్మినార్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బిజెపి నాయకులు మీర్‌ఫిరాసత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో నూర్‌ఖాన్‌బజార్‌లో జరిగిన కార్యక్ర మంలో బిజెపి నాయకులు కలిసి సన్మానించారు.

## ప్రేమ్ జీవన్ జైస్వాల్ మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు

**టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా**

ధర్నాచౌక్, అక్టోబర్ 1, ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి అంకితభావంతో సేవలు అందించిన ప్రేమ్ జీవన్ జైస్వాల్ మరణం పార్టీకి తీరని లోటని సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా అన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఉదయం మరణించిన ప్రేమ్ జైస్వాల్ కుటుంబసభ్యులకు ఆయన సానుభూతి తెలియచేశారు. ఈ సందర్భంగా సాయిబాబా ఒక ప్రకటన విడుదల చేస్తూ గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ప్రేమ్ జీవన్ జైస్వాల్ 1986 జీహెచ్ఎంసీ ఎన్నికలలో సుల్తాన్‌బజార్ డివిజన్ నుండి కార్పొరేటర్‌గా గెలుపొంది, నాటి నుండి నేటి వరకు సేవలు పార్టీకి అందించారని గుర్తుచేశారు.


నాదర్‌గుల్ గ్రామంలో నవచైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోరూ.3.2 లక్షలకు వేలంలో లడ్డూను పొందిన పన్నాల కృష్ణారెడ్డి

## మహాత్మా గాంధీ బోధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి


పేద మహిళలకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న ఎం.వంశీ

సైఫాబాద్, అక్టోబరు 1 ప్రభాతవార్త: జాతిపిత మహాత్మాగాంధీ బోదించిన సత్యం, ఆహింస, పరమ ధర్మంను ప్రతి ఒక్కరూ పాటించాలని జెన్‌సార్ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, సంఘ సంస్కర్త ఎం.వంశీ చెప్పారు. ప్రపంచంలోని ఆనేక దేశాలలో గాంధీ చేసిన బోధనలను ప్రజలు అచరిస్తూ గాంధీ విగ్రహాలకు పూజలు చేస్తున్నారని, అలాగే మన దేశంలో కూడా ఆ అచరణ కొనసాగుతున్నదన్నారు. దురదృష్టవశాత్తు మన దేశంలో కొంత మంది గాంధీ బోధనలు పట్టించుకోవడం లేదన్నారు. గాంధీ జయంతి, దసరా పండు గని పురస్కరించుకుని శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నాడిక్కడ నిరుపేద, వృద్ద మహిళలకు ఉచితంగా నూతన వస్త్రాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు నూతి శ్రీకర్‌శర్మ, సభ్యుడు మనిగండ్ల శ్రీనివాస్‌గుప్తా, డాక్టర్ రోజా, ఇంజనీర్ కార్తిక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ లీగ్ 3 కరపత్రం ఆవిష్కరణ



మలక్‌పేట్, అక్టోబర్ 1 ప్రభాతవార్త : మలక్‌పేట్ శ్రీకృపా మార్కెట్ హోల్ అండ్ టిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి 8వ తేదీ వరకు స్పోర్ట్స్ లీగ్..3 క్రీడా పోటీలను అల్మాస్ గూడలోని మాస్టర్స్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కా చంద్రమోహన్ పేర్కొన్నారు. ఆటల పోటీలకు సంభందించిన కరపత్రాలను రాజేస్ అగర్వాల్, రూపేష్ అగర్వాల్ దీపక్ మోడి, కోషాదికారి పరశురామ్‌తలో కలిసి ఆవిష్కరించారు.

## ప్రత్యర్థి ఎవ్వరైనా బంపర్ మెజార్టీతో గెలుస్తా: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


కాచిగూడలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్, అక్టోబరు 1 ప్రభాతవార్త : అంబర్‌పేట నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో బంపర్ మెజార్టీ గెలువబోతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ప్రత్యర్థి ఎవరైనా పర్వలేదని,తన గెలుపు నల్లేరు మీద నడక అన్నారు. ఆదివారం కాచిగూడ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. భూమన్నగల్లి, లింగంపల్లిలో 20లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్‌లైన్ల పనులకు స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం లింగంపల్లిలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో అంబర్‌పేట నుండి 1016 ఓట్ల మెజార్టీతో గెలిచానని, ఈసారి మాత్రం ప్రజల మద్దతుతో బంపర్ మెజార్టీ సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఇందుకు ప్రత్యర్థి ఎవ్వరైనా..ఏ పార్టీ అయినా పర్వలేదన్నారు. 'అంబర్‌పేట అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నా. ఉదయం 5.30 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు నావద్దనే ఉండే నా సెల్‌ఫోన్‌కు వచ్చే ప్రతి కాల్స్‌కు నేనే మాట్లాడుతా, వారి బాధలు, సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తా, ఉదయం 5.30గంటల నుంచే నా ఇంటికి వచ్చే ప్రతి వ్యక్తిని కలిసి వారి కష్టసుఖాలను తెలుసుకుంటా. వారికి చేదోడుగా నిలుస్తున్నా'..అంటూ ఎమ్మెల్యే కాలేరు అనునిత్యం ప్రజలతో ఉంటున్న అనుబంధాన్ని గుర్తుచేశారు. అంబర్‌పేట నియోజకవర్గం ప్రజలకు 3వేల మందికి డుబల్ బెడ్‌రూమ్‌లు ఉచితంగా పంపిణి చేశానని, మరో 3వేల మందికి గృహలక్ష్మీ పథకాన్ని వర్తింపచేశానని చెప్పారు. సుమారు 4వేల మందికి 20కోట్ల సిఎంఆర్ఎఫ్ కింద చెక్కులు పంపిణి చేశానని చెప్పారు. ఇటీవల 52 కోట్లతో మంత్రి కెటిఆర్‌తో కలిసి ముసరాంబాగ్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. కర్నాటక సాహిత్య మందిర్‌కు 5కోట్లు మంజూరు చేయడం జరిగిందని, త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. కాచిగూడ డివిజన్‌లో 18 కోట్ల విలువగల జలమండలి పనులకు టెండర్లకు పెట్టడం జరిగిందన్నారు. 15 కోట్లతో చేపట్టిన నారాయణగూడ మోడల్ రైతు మార్కెట్‌ను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. ఇటీవల అంబర్‌పేటలో ముస్లీం స్మశాన వాటిక, బాగ్అంబర్‌పేటలో హిందూ స్మశానవాటిక అభివృద్ధి పనులను ప్రారంభించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దిడ్డి రాంబాబు, డాక్టర్ శిరీష ఓంప్రకాష్‌యాదవ్, సునీల్ బిడ్లాని, భీష్మ, పెంట రమేష్, బిజెపి సీనియర్ నాయకుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు: ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్, అక్టోబర్ 1 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేటలోని శ్రీరామ్‌స్కేటింగ్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న ఇంటర్‌స్కూల్ స్కేటింగ్ పోటీలకు ప్రభుత్వ విప్, మేడ్చల్ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ముఖ్య అతిథిగా హాజరై ఇండియన్ ఫాస్టెస్ట్ స్కేటర్, ఆసియన్ మెడలిస్ట్ నిఖిలేష్ తబానేతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడారంగాల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు తగిన గుర్తింపునిస్తుందని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## దుండిగల్‌లో రూ3లక్షల2వేలు పలికిన గణనాథుని లడ్డూ


భరత్‌పటేల్‌కు లడ్డూను అందజేస్తున్న ఉత్సవకమిటి సభ్యులు

దుండిగల్, అక్టోబర్ 1 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి దుండిగల్ గ్రామంలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన గణపయ్య నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా కొనసాగింది. ఈసందర్భంగా స్వామివారి లడ్డూను వేలం పాటలో రూ,3లక్షల2వేలకు భరత్‌పటేల్ దక్కించుకున్నారు. ఉత్స వ కమిటి సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి స్వామి వారి లడ్డూను అందజేశారు. అనంతరం భరత్‌పటేల్ మాట్లాడుతూ అత్యంత భక్తిశ్రద్దలతో పూజలందుకున్న గణపయ్య లడ్డూను కైవసం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో అందరూ బాగుండాలని అభిలషించారు. కార్యక్రమంలో ఉత్స వకమిటి సభ్యులు, సంఘం నాయకులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## 73వేల 5వందలకు లడ్డును కైవసం


వివేకానందనగర్‌లో శ్రీగణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద రూ.73వేల 5వందలకు లడ్డును కైవసం చేసుకున్న బిజెపి డివిజన్ ప్రధాన కార్యదర్శి బొంతు హరికృష్ణ

యూసుఫ్‌గూడ, అక్టోబర్ 1, ప్రభాతవార్త : గణేష్ నవరాత్రి ఉత్స వాలు ముగింపులో భాగంగా 13వ రోజు అయిన శ్రీగణేష్ యూ త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ మండపం వద్ద 13వరోజు నిమజ్జనం సందర్భంగా లడ్డు వేలం పాట నిర్వహించారు. డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి బొంతు హరికృష్ణ రూ.73వేల5వందలకు లడ్డును కైవసం చేసుకున్నారు.

## టియుడబ్ల్యూజే ఆందోళన విజయవంతం చేయాలి

**జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు**

జీడిమెట్ల, అక్టోబర్ 1 ప్రభాతవార్త: గాంధీ జయంతి సందర్భంగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టనున్న ఆందోళన కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా జర్నలిస్టులు భాగస్వాములు కావాలని టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు కోరారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అక్రిడేటేడ్ జర్నలిస్టులకు రైల్వేపాస్‌లను పునరుద్ధరించాలనే డిమాండ్లతో జయంతి రోజైన అక్టోబర్ 2న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) ఆందోళన కార్యక్ర మానికి పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమాన్ని మన జిల్లాలో జర్నలిస్టులు విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో జర్నలిస్టులు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## బాధ్యతాయుతంగా పనిచేస్తున్నాం

**మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి**


సురేష్‌రెడ్డి సత్కరిస్తున్న భగత్‌సింగ్‌నగర్ వాసులు

జీడిమెట్ల, అక్టోబర్ 1 ప్రభాతవార్త : సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీవాసులు అదివారం మాజీకార్పొరేటర్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గుడిమెట్ల సురేష్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కాలనీకి నూతనంగా సిసిరోడ్ల నిర్మాణానికి రూ,48లక్షల80వేల నిధులను మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన్ని సత్కరించారు. ఈసందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి బస్తీ, కాలనీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడం మాబాధ్యత అని, అందుకే ప్రతిరోజు బస్తీలలో తిరుగుతూ ఏసమస్యలు ఉన్నాయో తెలుసుకొని వాటిని పరిష్కరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జహంగీర్, సంక్షేమసంఘం నాయకులు అమ్జద్, సైదులు, గడ్డం కిష్టయ్య, గోపాల్‌దాస్, కరీమ్, యాకస్వామి, బహదూర్, వెంకన్న, తిరుపతి పాల్గొన్నారు.


కోకాపేట్ కొత్త చెరువు వద్ద స్వచ్ఛతా హీ సేవాలో పాల్గొన్న నార్సింగి కమీషనర్ సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ విజయ్‌బాబు

## గండిపేట మండలంలో విజయవంతంగా స్వచ్ఛతా హీ సేవా

**చెత్తను ఎత్తిన అధికారులు, నేతలు, విద్యార్థులు**


ఖానాపూర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో చెత్తను ఎత్తుతున్న బిఆర్ఎస్ అధ్యక్షులు నర్సిహ్మా, కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డిలు

నార్సింగి, అక్టోబర్ 1 ప్రభాతవార్త : గండిపేట మండలంలో ఆదివారం జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం విజయవంతంగా జరిగింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, పుర ప్రముఖులంతా కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొని చెత్తను ఎత్తివేశారు. ఇళ్ల మధ్యన, రోడ్ల పక్కన, బస్టాపుల వద్ద, ప్రభుత్వ కార్యాలయాలు, చెరువు గట్ల వద్ద ఉన్న చెత్తను గంట పాటు శ్రమదానం చేసి ఎత్తివేశారు. వందలాది మంది ఈ కార్యక్రమాల్లో పాల్గొని పెద్ద ఎత్తున చెత్తను తొలగించారు. భావి పౌరులైన విద్యార్థులకు స్వచ్ఛత కార్యక్రమంలో భాగస్వాములను చేసి, చెత్త పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు, కమీషనర్ శరత్‌చంద్ర, ఇతర అధికార గణం పాల్గొని చెత్తను తొలగించారు. అలాగే నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి, వైస్ ఛైర్మన్ గొర్ల వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు శివారెడ్డి, విజయ్‌బాబు, దుర్గేష్ యాదవ్, అధికారగణం, పాఠశాల విద్యార్థులు పాల్గొని చెత్తను ఎత్తివేశారు. పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన పెంచుకున్నారు. అలాగే మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కమీషనర్ ఫల్గుణ్ కుమార్, ఛైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్, వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, పుర ప్రముఖులు పాల్గొని స్వచ్ఛతా హీ సేవాలో చీపుర్లు పట్టి చెత్తను ఎత్తారు. విద్యార్థులకు, స్థానికులకు చెత్త, నీరు నిలువ ఉండకుండా జాగ్రత్త వహించాలని సూచనలు చేశారు.



చింత ప్రభాకర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

## బిఆర్ఎస్‌లో చేరిన బేగంపేట సర్పంచ్

**కంది, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని బేగంపేట గ్రామ సర్పంచ్ రాజేందర్ నాయక్ కాంగ్రెస్ పార్టీని వీడి తన అనచరులతో (100 మందితో) కలిసి ఆదివారం కారెక్కారు. బిఆర్ఎస్‌లో చేరిన సర్పంచ్, వార్డు సభ్యులు ప్రభుగౌడ్, రవినాయక్, కాంగ్రెస్‌నాయకులు రఘు, హరినాయక్, కిష్టయ్య, ప్రసాద్, మల్లేశం గౌడ్, ప్రకాష్, ప్రభాకర్, కిషన్, శ్రీనివాస్, సాయి కిరణ్ సంజీవ్ తదితరులను సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ చైర్మన్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు చింత ప్రభాకర్ పార్టీ ఖండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్‌లో చేరినవారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 20లక్షల మంజూరైనట్లు పేర్కొన్నారు. గ్రామాల అభివృద్దే లక్ష్యంగా సిఎం కేసిఆర్, మంత్రి హరీష్‌రావులు పాలన సాగిస్తున్నారన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన ఈదులనాగులపల్లి వాసులు



కాంగ్రెస్‌లో చేరుతున్న ఈదులనాగులపల్లి బిఆర్ఎస్, బిజెపి నాయకులు

**సంగారెడ్డి, అక్టోబరు 1, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీతోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులనాగులపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన యువకులు (25 మంది) ఆదివారం పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన యువతకు కాట శ్రీనివాస్‌గౌడ్ పార్టీ ఖండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలన చేస్తున్నాయని విమర్శించారు. రానున్న శాసన సభ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్‌కు, బిజెపికి తగు రీతిలో గుణపాఠం చెప్పడం తథ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పార్టీ ప్రెసిడెంట్ సి.ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్, గోపాల్, మల్లయ్య, శంకర్, దిలీప్, నితిన్, రోహిత్ పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో మిలాద్ ఉన్ నబీ..భారీ ర్యాలీ



సంగారెడ్డిలో ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

**సంగారెడ్డి మున్సిపాలిటి అక్టోబరు 1,ప్రభాతవార్త:** మెహమ్మద్ ప్రవక్త మెహమ్మద్ సల్లేల్లాహు అలైవసల్లమ్‌గారి పుట్టిన రోజైన మిలాద్‌ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సంగారెడ్డి పట్టణానికి చెందిన ముస్లీమ్ మత పెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీదుల గుండా సాగింది.సంగారెడ్డిలోని నాల్‌సాబ్‌గడ్డ నుండి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధులలో కొనసాగింది.నాల్‌సాబ్‌గడ్డ నుండి ప్రారంభమై, కల్వకుంటా రోడ్డు,ఐటిఐ.బిఎస్ఎన్ఎల్ కార్యలయం బైపాస్‌రోడ్డు నుండి ఐబి నుండి పాతబస్టాండ్ వరకు సాగింది.ర్యాలీలో మస్లీమ్ మతపెద్దలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ర్యాలీ సందర్బంగా నారే తక్బీర్ అల్లాహు అక్బర్ అంటూ నినాదాలు ఇచ్చారు. సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్ రోడ్డు వద్ద ర్యాలీని రాష్ట్ర చేనేత అబివృద్ధి సంస్థ చైర్మేన్ చింతా ప్రభాకర్ ప్రారంభించారు.ర్యాలీ సందర్బంగా పట్టణం పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

**హత్నూరలో...**



ర్యాలీలో పాల్గొన్న ముస్లీమ్‌లు

**హత్నూర అక్టోబరు 1,ప్రభాతవార్త:** మెహమ్మద్ ప్రవక్త మెహమ్మద్ సల్లేల్లాహు అలైవసల్లమ్‌గారి పుట్టిన రోజైన మిలాద్‌ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని హత్నూర మండలంలో ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించారు. మండల కేంద్రమైన హత్నూరతోపాటు మేజర్ గ్రామ పంచాయతీ దౌల్తాబాద్‌లో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆయా ర్యాలీలో ఆయా గ్రామాల మతపెద్దలు,యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాలలోని ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులను, గ్రామముఖ్యులను శాలువాలతో సన్మానించారు.ఈసందర్బంగా గ్రామంలో అన్నదాన కార్యాక్రమం నిర్వహించారు.ర్యాలీ సందర్బంగా నారే తక్బీర్ అల్లాహు అక్బర్ అంటూ నినాదాలు ఇచ్చారు.

## ఆశావర్కర్ల వినూత్న నిరసన



కళ్లకు నల్లగుడ్డలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

**చౌటకూరు, అక్టోబరు 1, ప్రభాతవార్త:** న్యాయ మైన డిమాండ్ సాధన కోసం ఆశావర్కర్లు చౌటకూరులోని తహసీల్దార్ కార్యాలయం ముందు చేస్తున్న సమ్మె ఆదివారానికి 7వ రోజుకు చేరుకుంది. ఆదివారం ఆశా వర్కర్లు తమ కండ్లకు నల్ల గుడ్డలు కట్టుకుని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు.

## సిద్దేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న నరోత్తం

**సంగారెడ్డి, అక్టోబరు 1, ప్రభాతవార్త:** ఝరాసంగం మండలం పొట్‌పల్లి గ్రామంలోని శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ వై నరోత్తం పార్టీ నాయకులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో కొలువున్న స్వామి వారికి ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నరోత్తంకు ఆశీర్వచనాలుచేసి తీర్థ ప్రసాదాలు అందచేసి శాలువా, పూల మాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు బొగ్గుల జగదీశ్వర్, కేతకి ఆలయ కమిటి సభ్యులు నాగేష్ సజ్జనర్, సిద్దన్న పాటిల్, కేతకి ఆలయ మాజీ చైర్మన్ హనుమన్నపాటిల్, కుప్పానగర్ మాజీఎంపిటిసి సభ్యులు, నాయకులు పండరినాథ్, ఎంపి శ్రీనివాస్, మాణిక్, రాములు, బాల్‌రాజ్, మహ్మద్ ఇసుబ్ తదితరులు పాల్గొన్నారు.



మామిడ్గిలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న సర్పంచ్



సదాశివపేటలో స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న పి.రాజు




మ్యాక్ సొసైటీ కాలనీలో కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి



చౌటకూరులో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న దృశ్యం



కొత్తపల్లిలో స్వచ్ భారత్ నిర్వహిస్తున్న దృశ్యం



తెల్లాపూర్‌లో పరిసరలాను పరిశుభ్రం చేస్తున్న దృశ్యం




శ్రీనివాస్‌నగర్‌లో స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న కార్పొరేటర్



సంగారెడ్డి ఎస్‌బిఐ బ్యాంకు వద్ద బిజెపి నాయకులు

# సంగారెడ్డి జిల్లాలో స్వచ్ఛ తా హీ సేవ

**సంగారెడ్డి, అక్టోబరు 1, ప్రభాతవార్త:** స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాలలో భాగంగా ఆదివారం న్యాల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. మల్గి, మెటల్‌కుంట,మామిడ్గి, చీకూర్త తదితర గ్రామాల్లో 1 గంటపాటు చెత్తా చెదారాన్ని తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్బంగా సర్పంచ్, మండల సర్పంచ్‌లు ఫోరం ఉపాధ్యక్షులు మారుతి యాదవ్, మెటల్‌కుంట సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి పీటర్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు శివానంద శ్రీపతి, వార్డుసభ్యులు విఠల్, సిద్దారెడ్డి, సిఏ నర్సారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ అంబిక, రేషన్ డీలర్ భీమ్‌రావు యువ జన సంఘాల నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, వార్డుసభ్యులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**సదాశివపేట 12వ వార్డులో...**

**సంగారెడ్డి, అక్టోబరు 1, ప్రభాతవార్త:** సదాశివపేట పట్టణంలోని 12వ వార్డులో ఆదివారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని రోడ్లు, వార్డులోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్బంగా కౌన్సిలర్, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిజెపి రాష్ట్ర నేత, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వార్డుఆఫీసర్ నర్సింలు, మెప్మా సిబ్బంది అనిత, శారద, రాధిక, సునిత, వర్కుల లక్ష్మి, సులోచన, మల్లమ్మ, పంతులు ఆహల్య, మాణిక్యం, ఫయాజ్, రియాజ్, అంజన్న, నీలి వెంకటేశం, ఫహీం, గౌస్, జగన్నాథం, ఎంపి నిసార్, పిఎంఆర్ యువసేన నాయకులు హరీష్, రాగం అనిల్ కుమార్, గుణాకర్, ఆనంద్, నల్ల సాయి, వెంకట్, సోమ శంకర్, పరమాదాసు, రామన్న పాల్గొన్నారు.

**మ్యాక్ సొసైటీ కాలనీలో...**

**సంగారెడ్డి, అక్టోబరు 1, ప్రభాతవార్త:** రామచంద్రాపురం, మండలం భారతీనగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీ ఈఎస్ఐ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో ఆదివారం జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. జిహెచ్ఎంసి అధికారులతో కలిసి కార్పొరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని బాబ్‌కట్, పారిశుధ్య కార్మికులతో పరిసరాలు పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సింధూ ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాలనీలోని రోడ్లు, పరిసరాలను ఎప్పటికి అప్పుడు పరిశుభ్రంగా ఉండేలా రాంకీ సూపర్‌వైజర్ అనిల్‌ను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

**చౌటకూరులో...**

**చౌటకూరు, అక్టోబరు 1,ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ వీరమణి మొగులయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ యాదగిరి, డ్వాక్రా గ్రూపు సభ్యులు, అంగన్‌వాడి టీచర్లు, పంచాయతీ కార్యదర్శి సందీప్‌గౌడ్ ఆధ్వర్యంలో ఒక గంట సేపు పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్బంగా సర్పంచ్ వీరణమి మొగులయ్య మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. ఆయా వార్డులలో బ్లీచింగ్ పౌడర్, దోమల మందు పిచికారి తదితర పరిశ్రుభ్రత కార్యక్రమాలు పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

**కోడూర్‌లో...**

పుల్కల్ మండలం కోడూర్‌లో ఆదివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పరిసరాలను పరిశుభం చేశారు. కార్యక్రమంలో కోడూర్ పంచాయతీ కార్యదర్శి సరిత, అంగన్‌వాడీ టీచర్‌లు శైలజ, సంధ్య, బిసి యువజన సంఘం మండల అధ్యక్షులు రవీందర్, బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు మల్లేశం, ఫీల్డ్ అసిస్టెంట్ బయప్ప, బిజెపి నాయకులు లక్ష్మణ్, సంగారెడ్డి, డ్వాక్రా గ్రూపుమహిళలు, నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత...**

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 1,ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందని తారా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెస్ఎస్ రత్నా ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని తారా కళాశాల(ఎ)లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కొత్త బస్టాండ్, పరిసర ప్రాంతాలలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యాలు అదుపులో ఉంటాయని, ఆరోగ్యమే మహా భాగ్యం అన్న నిజాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపాల్ వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగదీశ్వర్, కొత్తబస్టాండ్, బస్‌డిపో సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అమర్, పవన్, సౌమ్య, రాజేష్, సంతోష్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

**తెల్లాపూర్ మున్సిపాలిటీలో...**

**సంగారెడ్డి, అక్టోబరు 1, ప్రభాతవార్త:** ఆదివారం ఏక్ తారీఖ్ ఏక్ గంట శ్రమదాన్ కార్యక్రమాన్ని(స్వచ్ఛతా హి సేవ)ను తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని 17 వార్డులలో నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయా వార్డులలో కార్యక్రమంపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. తడి పొడి చెత్తను వేరువేరు చేసి మున్సిపల్ వాహనాల్లోకి అందించాలని, ప్లాస్టిట్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయా వార్డులలో చెత్తా చెదారాన్ని, పిచ్చి మొక్కల తొలగింపు తదితర పరి శుభ్రత కార్యక్రమాన్ని వార్డు ప్రజల, ప్రజాప్రతినిధులతో కలిసి శ్రమదానం చేశారు. తెల్లాపూర్ జిల్లా పరిషత్, ఈదుల నాగులపల్లి పాఠశాలలో విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, మున్సిపల్, మెప్మా సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

**శ్రీనివాస్‌నగర్‌లో...**

**సంగారెడ్డి, అక్టోబరు 1, ప్రభాతవార్త:** ఆదివారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద ఉన్న ప్రైమరి హెల్త్ సెంటర్ పరిసరాల్లో, లింగంపల్లి బస్సుస్టాప్ ఇందిరా గాంధీ విగ్రహం వద్ద స్వచ్ఛ హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కాలనీల్లో పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్,జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, శానిటేషన్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, శానిటేషన్ ఎస్ఎఫ్ఎలు, సిబ్బంది, కాంకీ అధికారులు, సిబ్బంది పాల్గొని చెత్తాచెదారాన్ని తొలగించారు.

**సంగారెడ్డి ఎస్‌బిఐ ప్రాంతంలో...**

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** ఆదివారం సంగారెడ్డి పట్టణంలోని ఎస్‌బిఐ పరిసరాల్లో భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు ఆధ్వర్యంలో ఉదయం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు బ్యాంక్ పరిసరాల్లో పరిశుభ్రత పనులు చేపట్టినట్లు రాములు పేర్కొన్నారు. సంగారెడ్డి అసెంబ్లీ పరిధిలో ప్రతి బూత్‌లో బిజెపి శ్రేణులు పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు వెంకట నరసింహారెడ్డి, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి పుల్లంగారి సురేందర్, దోమల విజయకుమార్, ఏబివిపి శ్రీకాంత్, శివంగుళ నాగరాజ్, గురునాథ్, సూర్య నాయక్, మానసింగ్, వెంకన్న చారి తదితరులు పాల్గొన్నారు.

**కొత్తపల్లిలో...**

**పాపన్నపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:** పారిశుధ్య రహిత గ్రామాలుగా తీర్చదిద్దుకునేందుకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మాజీ జడ్పీటిసి సభ్యులు మల్లప్ప పేర్కొన్నారు.ఆదివారం మండల పరిధిలోని కొత్తపల్లిలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని 1 గంట పాటు శ్రమదానం నిర్వహించారు. గ్రామంలోని చెత్తా చెదారాన్ని, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి, బూత్ అధ్యక్షులు బైండ్ల దుర్గయ్య, ఆర్ లింగం, యాదగిరి, బాలరాజు, గోపాల్, ప్రవీణ్, రమేష్, బైండ్ల పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

**రామచంద్రాపురంలో...**

**రామచంద్రాపురం, అక్టోబరు 1, ప్రభాతవార్త:** ఆదివారం రామచంద్రాపురంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. పరిసరాలను పరిసరాల పరిశుభ్రతతతో ఆరోగ్యాలు పదిలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు బసమ్మ, భారతినగర్ డివిజన్ ఉపాధ్యక్షురాలు గీత, నాయకులు మల్లేష్‌ముదిరాజ్,బూత్ కమిటి అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, యాదిరెడ్డి, ఐ సత్యనారాయణ, కామేశ్వరరావు, రాములు, భిక్షపతి పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

## పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**సదాశివపేట, అక్టోబరు 1, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 193-94 విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో విద్యను అందుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, బోడగామ శ్రీశైలం, అశోక్‌కుమార్, రుక్మారెడ్డి, అంబటి సురేష్, రవీంద్రనాథ్‌లు పాల్గొనగా పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను సత్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆత్మీయ సమ్మేళనాలు ప్రతి బ్యాచ్ విద్యార్థులు ఏర్పాటు చేసుకుంటే మనసుకు ఉల్లాసంతో పాటు సోదర, స్నేహ, బంధుత్వాలు పెరుగుతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో 1993-94 పూర్వ విద్యార్థుల సమితి అధ్యక్షులు పోల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్నం సురేష్, కోశాధికారి గారెలా విజయకుమార్, గౌరవ అధ్యక్షులు పట్నం వీరేశలింగం పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**జహీరాబాద్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టపడుతూ కాకుండా ఇష్టపడుతూ క్రమ శిక్షణతో విద్యను అందుకుంటే భవిష్యత్తు బంగారు మయం కావడం తథ్యమని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య సమన్వయకర్త డాక్టర్ చంద్రవేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలో 10వ తరగతిలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థులకు 10వేల రూపాయల విలువ గల స్టడీ మెటీరియల్‌ను అందచేశారు. ఈ సందర్బంగా మాజీ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 5వేల మంది విద్యార్థులు 10వ తరగతిలో విద్యను అందుకుంటున్నారన్నారు. 10 విద్యార్థులందరూ 10జిపిఏ సాధించేందుకు గాను 10వేల రూపాయల విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను తమ బృంధం విద్యార్థుల ఇండ్లకు చేరుకుని పుస్తకాలను అందచేస్తామన్నారు. డిజిటల్ పద్దతిలో ఎలా తరగుతులు వినాలో అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్, పి రామలింగారెడ్డి, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు కండెం నర్సింలు, జడ్పీటిసి సభ్యులు నాగిశెట్టి రాథోడ్, రామ్‌దాస్, నాయకులు, పార్టీ ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

## చీపురు పట్టి ఊడ్చిన మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

**అమీన్‌పూర్, అక్టోబర్1 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఏక్ తారీక్.. ఏక్ గంట.. ఏక్ సాత్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పాల్గొన్నారు. అమీన్‌పూర్ బైపాస్ రోడ్డును మున్సిపల్ చైర్మన్ ప్రజలకు అవగాహన కల్పించేలా చీపురు పట్టి ఊడ్చారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి వారు పరిశుభ్రంగా ఉంటూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, ఆర్వో వెంకటరామయ్య, ఏఈ ప్రవీణ్, డీఈ వెంకటరమణ, కౌన్సిలర్ కృష్ణ, కల్పన ఉపేందర్‌రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మ్యాకం మల్లేష్, చౌటకూరి మైపాల్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



చీపురు పట్టి రోడ్డును ఊడుసునతన్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

## ఎవిఎన్ఎల్ రెండవ ఆవిర్భావ దినోత్సవం

**కంది, అక్టోబరు 1, ప్రభాతవార్త:** ఎవిఎన్ఎల్ యూనిట్ అయిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఎస్టేట్‌లోని శరత్ కమ్యూనిటీ హాల్లఓ ఆదివారం 2వ ఎవిఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఓఎఫ్‌యంకె ఉద్యోగులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏవిఎన్ఎల్ జండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో భాగంగా ఎంఎఫ్‌యంకెలో తయారు కాబడుతున్న బిఎంపి-2, డిఎంటి, అర్‌మౌరెడా అంబులెన్స్, సిఆర్ఎన్-91 మోడల్‌లను ప్రదర్శించారు. త సందర్బంగా నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందచేశారు.

## కేశ్వర్‌లో ముమ్మరంగా అభివృద్ధి పనులు

**నాగల్‌గిద్ద, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కేశ్వర్ గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని సర్పంచ్ హన్మవ్వ పేర్కొన్నారు. ఈ సందరర్బంగా సర్పంచ్ హన్మవ్వ మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి పనులతో దూసుకుపోతున్నాయన్నారు. గ్రామ పంచాయితీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రామంలో ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సహకారంతో సిసి రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయని, నిర్మాణం పనులు పూర్తయితే ప్రజలకు సౌకర్యం కల్గుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నర్సింలు, ఆరిఫ్ పటేల్, క్లప్ప, నిలకంఠ్, గఫర్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

**కొల్చారం, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** పరిసరాల పరిశుభ్రంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రమేష్ నాయక్ అన్నారు. ఆదివారం కొల్చారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు రమేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో కలిసి స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో శ్రమదానం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం వైద్యులు రమేష్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో 'స్వచ్ఛాంజలి'

**మెదక్ అర్బన్, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రధాని నరేంద్ర మోడీ స్వచ్ఛాంజలి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆదివారం మెదక్ పట్టణంలోని ఇంద్రపురి కాలనీలో బీజేపీ మెదక్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రక్కన చెత్తాచెదారంతో పాటు ప్లాస్టిక్ కవర్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి రాజశేఖర్, యువమోర్చా జిల్లా నాయకులు సతీష్, కల్కి నాగరాజు, మహిళా మోర్చా నాయకులు సంగీత, ప్రవళిక, యువత పట్టణ అధ్యక్షులు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



శ్రమదానంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్



సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతు పనులు చేయిస్తున్న సర్పంచ్ మారుతియాదవ్

## మల్గిలో సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు

**సంగారెడ్డి, అక్టోబరు 1, ప్రభాతవార్త:** న్యాల్‌కల్ మండలంలోని మల్గి గ్రామ శివారులోని శ్రీనవనాథ్ సిద్దేశ్వరస్వామి వారి ఆలయానికి వెళ్లే రోడ్డు మరమ్మతు పనులను సొంత ఖర్చులతో చేయించినట్లు సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు జెట్‌గొండ మారుతి యాదవ్ పేర్కొన్నారు. ఇటీవల కురిసన వర్షాలకు ఆలయానికి వెళ్లే రోడ్డు దెబ్బతిందని, ఫలితంగా భక్తులు ఆలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండటంతో స్వంత ఖర్చులు వెచ్చింది శనివారం మరమ్మత్తు పనులు చేయించామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు శివానంద శ్రీపతి, శ్రీ నవనాథ్ సిద్దేశ్వర ఆలయ కమిటి అధ్యక్షులు సిద్దారెడ్డి, సభ్యులు విఠల్, మారుతి, మాణిక్, పండిత్ శాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



జాతీయ రహదారి 161బి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**మనూర్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట నుంచి కర్నాటకలోని బీదర్ పట్టణంవరకు 513 కోట్లతో 46 కిలో మీటర్లమేర జాతీయరహదారి 161బి రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. మండల పరిధిలోని పుల్‌కుర్తి గ్రామ శివారులో రోడ్డు నిర్మాణానికి ముళ్లపొదల తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టర్ లకు పలు సూచనలు చేశారు. రోడ్డు నిర్మాణం పనులు నాణ్యవంతంగా వేగవంతంగా పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావు, ఎంపిటిసి సభ్యులు అంబారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు నాగన్న, శివాజీరావు నారాయణఖేడ్ జడ్పీటిసి సభ్యులు రవీందర్ నాయక్, ఉవ నాయకులు నాగేందర్, బిరాదార్ శివశంకర్, సంజీవరెడ్డి, అంజాగౌడ్, మన్నన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సుభిక్షానికి గ్రామంలో యజ్ఞాలు

**మనూర్, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండలంలోని మైకోడ్ గ్రామం సుభిక్షాన్ని కాంకిస్తూ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి మాసం మొదటి ఆదివారం హనుమాన్ ఆలయంలో దంపతులతో యజ్ఞం, పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా అక్టోబరు 1వ తేదీన ఆదివారం కావడంతో భక్త దంపతులు యజ్ఞ హోమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్ర మలగొండ దంపతులు యజ్ఞ హోమాలు నిర్వహించి భక్తులకు అన్నదాన వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిత సుధాకర్, నాయకులు, వివేకానంద సేవా సమితి బాధ్యులు భీమన్న, శివరాజ్, సంగమేశ్వర్, నారాయణ, చంద్రకాంత్, అనంత్, హెచ్ సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## చింతమాణి తండాలో కరెంట్‌షాక్‌తో ఆవు మృతి

**కంగ్టి, అక్టోబరు 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తుక్కవడగావ్ చింతమాణి తండాకు చెందిన రైతు గణేష్ పోషించుకుంటున్న ఆవు (60వేల రూపాయల విలువ గలది) విద్యుద్ఘాతంతో ఆవివారం మృత్యువాత పడింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు కింతికి వేలాడి ఉండటంతో అటుగా వెళుతున్న మూగజీవి ఆవు వైర్లకు తాకడంతో ఆవు అక్కడికి అక్కడే గిలగిలమంటూ కొట్టుకుంటూ మృతి చెందిందని రైతు గణేష్ కన్నీరు కారుస్తూ విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు రైతు గణేష్‌ను ఆర్థికంగా ఆదుకోవాలని తండా వాసులు వినతి చేస్తున్నారు.